సాక్షి శ్రీకాకుళం

శనివారం । 31 । ఆగస్టు । 2024



అయ్యో.. హోమియో

హోమియో వైద్యుల కొరత జిల్లాను వెంటాడుతోంది. ఫలితంగా ఆస్పత్రులు తెరచుకోవడం లేదు.

- 8లో



మొక్కల సంరక్షణ..

వన మహోత్సవాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొక్కలు సంరక్షించాలని మంత్రి అచ్చెన్న సూచించారు.

- 8లో

ఆర్‌జీయూకేటీ ప్రవేశాలకు నేడు చివరి కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) మొదటి ఏడాదికి శనివారం చివరి విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆర్‌కే వ్యాలీలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 1100 సీట్లకు ప్రస్తుతం 1046 ప్రవేశాలు పూర్తయ్యాయి. 54 సీట్లు మిగిలాయి. ఆన్‌లైన్‌లో క్యాంపస్ ట్రాన్స్‌ఫర్లు పూర్తికాగా, మెరిట్ వెయిటింగ్ లిస్టు ఆధారంగా ప్రవేశాలుంటాయి.

న్యూస్‌రీల్

తపాలా శాఖలో పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రధాన తపాలాశాఖ అధికారి

శ్రీకాకుళం అర్బన్: తపాలాశాఖ అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధాన తపాలా శాఖ పోస్టుమాస్టర్ పడాల రంగారావు అన్నారు. ఈ నెల 30, 31వ తేదీ రెండు రోజుల పాటు పీఓఎస్‌బీ(పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్) అకౌంట్స్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం పోస్టల్ సిబ్బందికి, వినియోగదారులకు తపాలాశాఖ పథకాలపై రంగారావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఎస్‌బీ, ఆర్‌డీ, ఎస్‌ఎస్‌ఏ, పీపీఎఫ్, ఎన్‌ఎస్‌సీ, కేవీపీ, ఎంఐఎస్, టీడీ, ఎస్‌సీఎస్‌ఎస్, ఎంఎస్‌ఎస్‌సీ ఖాతాలపై అవగాహన కల్పించారు. పదేళ్ల లోపు ఆడపిల్లల బంగారు భవిష్యత్ కోసం తపాలాశాఖలో కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సంవృద్ధి యోజన ఖాతాలు తెరవవచ్చన్నారు. అలాగే శ్రీకాకుళంలోని ప్రధాన తపాలాశాఖలో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలు పనివేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తపాలాశాఖ అధికారి నూలు భానోజీరావు, సిబ్బంది, వినియోగదారులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత



సీజ్ చేసిన లారీ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు, పొక్లెయినర్లను శ్రీకాకుళం తహసీల్దార్ ఎం.గణపతిరావు గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇసుక తరలింపునకు వెళ్తున్న వాహనాలను మాటు వేసి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.





మాటల్లోనే.. ఇసుక కోటలు

డీపీఆర్‌ఓ గ్రూపులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలియజేసినట్టుగా జారీ చేసిన ప్రకటన ఇది. ఈనెల 27వ తేదీ నుంచి బూర్జ మండలం కా ఖాండ్యం, గార మండలం శాలిహుండంలో ఇసుక స్టాక్ పాయింట్లు ప్రారంభిస్తున్నట్టు 26వ తేదీన అధికారిక ప్రకటన విడుదల చేశారు. 'ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ముందు వచ్చిన వారి ప్రాతిపదికన బుకింగ్ స్లాట్ కేటాయిస్తాం. బుకింగ్ పాయింట్ల వద్దకు ఎలాంటి వాహనాలు తీసుకురావద్దు. శాలిహుండం స్టాక్ పాయింట్ ఇసుక కోసం శాలిహుండం గ్రామ సచివాలయం వద్ద, కాఖాంద్యం ఇసుక పాయింట్ కోసం లంకాం మామిడివలస గ్రామ సచివాలయం వద్ద స్లాట్ బుక్ చేసుకోవాలి' అని ఆ ప్రకటనలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రకటన చూశాక ఇసుక వినియోగదారులు ఆ రెండు ప్రాంతాలకు వెళ్లారు. అధికారులు చెప్పిన సచివాలయాల వద్దకు వెళ్తే అక్కడ ఎలాంటి స్లాట్ బుకింగ్ చేయలేదు. స్టాక్ పాయింట్ దగ్గర ఇసుక విక్రయాలు జరపలేదు. దీంతో వినియోగదారులు కంగుతిన్నారు. అధికారులు చెప్పిన మొదటి రోజైన 27న ఏదో కారణం చేత ప్రారంభించలేకపోయి ఉంటారని సమర్థించవచ్చు. కానీ ఆ మరుసటి రోజైన 28న, 29న, 30న కూడా ఇసుక విక్రయాలు ప్రారంభించలేదు. ఇసుక దొరుకుతుందని రోజూ వెళ్తున్న వారికి నిరాశే మిగులుతోంది. ప్రకటన జారీ చేసిన నాలుగు రోజుల తర్వాత కూడా ఇసుక విక్రయాలు ప్రారంభించలేదు. దీంతో ఆ ప్రకటనకు విలువ లేకుండా పోయింది.



నాగావళి నది నుంచి ఇసుక తీసుకొస్తున్న దృశ్యం

- కార్యరూపం దాల్చని కలెక్టర్ ప్రకటన
- ఈ నెల 27 నుంచి రెండు స్టాక్ పాయింట్లను ప్రారంభిస్తున్నట్టు ప్రకటన
- శాలిహుండం, కాఖాండ్యంలో విక్రయాలు చేపట్టనున్నట్టు సమాచారం
- ఇప్పటి వరకు ప్రారంభం కాని విక్రయాలు
- ఇసుక కోసం రోజూ వచ్చి పోతున్న వినియోగదారులు
- ఆమదాలవలస, శ్రీకాకుళం రూరల్‌లో పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

ఏ మాత్రం ముందు చూపు లేకుండా అధికారులు జారీ చేసిన ప్రకటన అయోమయానికి గురి చేయడమే కాకుండా అక్కడికొచ్చే ఇసుక వినియోగదారులు ఎక్కడికెళ్లి తెచ్చుకోవాలో తెలియని గందరగోళ పరిస్థితిని తెచ్చిపెట్టింది. ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చిన ప్రారంభంలో టెక్కలి, అంగూరులో ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఉచితమని చెప్పి టన్నుకి రూ.340చొప్పున తీసుకుని విక్రయాలు జరిపారు. ఆ ఇసుక కాస్తా అయిపోయింది. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో పాటు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత, ఆందోళన వ్యక్తమవ్వడంతో యుద్ధ ప్రాతిపదికన శాలిహుండం, కాఖాండ్యంలో ఇసుక స్టాక్ పాయింట్లను ప్రారంభిస్తున్నట్టు హడావుడి చేశారు. కానీ ఆచరణలో పెట్టలేదు. అధికారులు చెప్పిన పాయింట్ల వద్ద ఇసుక విక్రయాలు జరగకపోవడంతో చివరికి, జిల్లాలో అనధికారికంగా విక్రయిస్తున్న పాయింట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకుని అక్కడికి వెళ్లి అడిగినంత డబ్బు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.



కొత్తవలస ఇటుక బట్టీల వద్ద పట్టపగలే ఇసుక లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న జేసీబీలు, ట్రాక్టర్లు

అంతులేని నిర్లిప్తత

ప్రకటన చేసే ముందు అన్నీ చూసుకోవాలి. అంతా సిద్ధంగా ఉంటేనే అధికారిక ప్రకటన చేయాలి. కానీ, సంబంధిత అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకుండా, కనీసం ఇసుక అందుబాటులోకి తేకుండా, కలెక్టర్ పేరుతో 27వ తేదీ నుంచి రెండు స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక విక్రయంచబోతున్నామని 26వ ప్రకటన విడుదల చేసి ఊరుకున్నారు. సాక్షాత్తు కలెక్టర్ పేరుతో ప్రకటన జారీ చేశారంటే ఎంత అప్రమత్తంగా ఉండాలి. కానీ, ఇక్కడ అధికారు లు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. స్లాట్ బుకింగ్, ఇసుక స్టాక్ పక్కన పెడితే కనీసం స్టాక్ పాయింట్‌లను కూడా తెరవలేదు.

అనధికార పాయింట్లే దిక్కు..

- శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస, నరసన్నపేట, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, పోలాకి, జలుమూరు, ఎచ్చెర్ల తదితర మండలాల్లోని నదీ తీర గ్రామాల్లో టీడీపీ నేతల కనుసన్నల్లో నడిచిన అనధికార ఇసుక ర్యాంపులు, పాయింట్ల వద్ద నుంచి ఇసుకను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.
- అధికారులు ప్రకటించిన శాలిహుండం, కా ఖాంద్యంలో అధికారిక విక్రయాలు జరగకపోవడంతో శ్రీకాకుళం రూరల్‌లోని బైరి, కరజాడ, కల్లేపల్లి, బట్టేరు, ఎచ్చెర్ల మండలం పొన్నాడ, ఆమదాలవలస మండలం కొత్తవలస, నిమ్మతొర్లాడలో పచ్చనేతల కనుసన్నల్లో జరుగుతున్న అనధికార ర్యాంపులు, పాయింట్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి కొనుగోలుదారులకు ఏర్పడింది.
- నిర్వాహకులు అడిగినంత ధర ఇచ్చుకుని తప్పని పరిస్థితుల్లో ఇసుక తీసుకెళ్తున్నారు.



● ధనలక్ష్మీ నమోస్తుతే..



శ్రావణ శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకాకుళం నానుబాలవీధిలోని విజయదుర్గ అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు. – శ్రీకాకుళం కల్చరల్

జిల్లా అదనపు ఎస్పీగా శ్రీనివాసరావు



పాత్రిని శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్ విభాగం)గా పాత్రిని శ్రీనివాసరావు ఉద్యోగోన్నతిపై రానున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. శ్రీనివాసరావు ప్రస్తుతం మన జిల్లాలోనే కాశీబుగ్గ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 1995లో ఎస్ఐగా శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శిక్షణ తీసుకుని గారలో తొలి పోస్టింగ్ దక్కించుకున్నారు. మందస, కాశీబుగ్గలో చేసి ఎచ్చెర్లలో ఉండగా 2002లో ఉద్యోగోన్నతిపై సీఐగా విశాఖ సిటీ వెళ్లారు. అనంతరం విజయనగరం, ఏసీబీలో చేసి కాశీబుగ్గ విధుల్లో ఉండగా డీఎస్పీగా 2011లో ఉద్యోగోన్నతి పొంది విజయనగరం పీటీసీ, శ్రీకాకుళం, ఇంటెలిజెన్స్, గుంటూరు డీసీఆర్బీలో చేసి మళ్లీ కాశీబుగ్గ డీఎస్పీగా ఇటీవల బదిలీపై వచ్చా రు. కాశీబుగ్గలోనే మళ్లీ ఉద్యోగోన్నతి పొంది అడిషనల్ ఎస్పీగా మన జిల్లాలోనే పోస్టింగ్ దక్కించుకోవడం విశేషం. ఇంతకుముందు అడిషనల్ ఎస్పీగా (క్రైమ్) పనిచేసిన ఉమామహేశ్వరరావు ఇటీవల పదవీవిరమణ చేసిన సంగతి విదితమే.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో భాగంగా సెప్టెంబర్ నెల పింఛన్లను ఈ నెల 31 అంటే శనివారం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాలకు ఈ పింఛన్ల మొత్తాన్ని అందజేశారు. ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ మొదలుకానుంది.

నెలలు గడుస్తున్న కొద్దీ జిల్లాలో పింఛన్‌దారుల సంఖ్య తగ్గుతోంది. గడిచిన మూడు నెలల్లో జిల్లాలో మూడు వేలకుపైగా పింఛన్లు తొలగించారు. జూలైలో జిల్లాలో 3,19,147 పింఛన్లు ఉండగా ఆగస్టుకి 3,18,017కి చేరాయి. తాజాగా ఈనెలకు గాను 3,16,883కి తగ్గాయి. ఓ వైపు పింఛన్ మొత్తాన్ని పెంచామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం మరోవైపు నిశ్శబ్దంగా పింఛన్‌దారులను తొలగిస్తోంది. ఇక కొత్త పింఛన్ల కోసం ఎదురు చూసే వారికి ఇప్పట్లో మంజూరు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

కొంటే కన్నీళ్లే..

కిలో ఉల్లి	రూ.60
కిలో వెల్లుల్లి	రూ.300

- దడ పుట్టిస్తున్న మార్కెట్ ధరలు



హిరమండలం: ఉల్లి, వెల్లుల్లి కొంటేనే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. ఉల్లి కిలో రూ.60కు చేరుకుంటుండడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. వెల్లుల్లి కిలో రూ.300 పలుకుతోంది. ఇతర ప్రాంతాల నుంచి సరుకుల రవాణా తగ్గడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉల్లి, వెల్లుల్లి తప్పనిసరిగా వినియోగించేవి కావడంతో కొనక తప్పడం లేదని కొనుగోలుదారులంటున్నారు.

తగ్గిన దిగుబడి

ఉల్లిపాయలు మహారాష్ట్రలో ఎక్కువగా పండుతాయి. అయితే భారీ వర్షాల కారణంగా దిగుబడి తగ్గి ఆ ప్రభావం ధరపై చూపుతోంది. జిల్లాకు ప్రతి రోజూ 20 లారీలకు పైగా ఉల్లిపాయలు రావాల్సి ఉన్నప్పటికీ కేవలం 10 లారీల వరకు మాత్రమే లోడు రావడంతో కొరత ఏర్పడుతోందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో సాధారణ రకం క్వింటాకు రూ.2800, మధ్య రకం రూ.4,400, మెదటి రకం రూ.4800 ధర పలుకుతోంది. దీనికి తోడు మళ్లీ రవాణా ఖర్చులు తోడవుతున్నాయి. మార్కెట్‌లో గత నాలుగు నెలల్లో రూ.40 కంటే తగ్గడం లేదు. ఈ రెండు నెలల్లో కిలో రూ.60కి పెరిగింది. వెల్లుల్లి ధర కూడా మార్కెట్‌లో కిలో రూ.300 వరకు పలుకుతోంది. మొదటి రకాన్ని రూ.350 వరకు కొనాల్సి వస్తోందని వినియోగదారులు వాపోతున్నారు.

తగ్గించి కొనాల్సి వస్తోంది



మార్కెట్‌లో గత నెల వరకు ఉల్లిపాయలు కిలో రూ.35కు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు రూ.60కి కొంటున్నాం. ధరలు పెరగడంతో తగ్గించి కొనుగోలు చేస్తున్నాం.

– దీర్ఘాశి చిన్నమ్మడు, గృహిణి, పాతహిరమండలం

మార్కెట్ ధరలను బట్టే విక్రయాలు

మార్కెట్ ధరలను బట్టి విక్రయిస్తున్నాం. హోల్‌సేల్ మార్కెట్‌లో రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి. మాకు కూడా సరుకు రద్దు వస్తోంది. నష్టాలు వస్తున్నాయి. ఎక్కువ ధరలని ఎవరూ కొనకపోతే ఉల్లి కుళ్లిపోతుంది.

– కోళ్ల ప్రసాద్, వ్యాపారి, ఎల్‌ఎన్‌పేట

● నలుచెరగులా.. వ్యాధులతో విలవిల



జిల్లా విష జ్వరాల గుప్పిట చిక్కుకుంది. ఇప్పటికే పదుల సంఖ్యలో డెంగీ కేసులు కూడా వెలుగుచూడడం మరింత ఆందోళన కలిగిస్తోంది. మలేరియా, వైరల్ జ్వరాలు ఊళ్లను వణికిస్తున్నాయి. దీనికి తోడుగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించి అతిసార వ్యాధులు ప్రబలుతున్నాయి.

● శ్రీముఖలింగంలో జ్వరాల కలకలం



లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీస్తున్న వైద్య సిబ్బంది

జలుమూరు: శ్రీముఖలింగంలో ప్రజలు మలేరియా, వైరల్ జ్వరాలతో బాధ పడుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన పమిడి లక్ష్మీనారాయణతో పాటు భార్య లక్ష్మీ, కుమార్తె సాయిలకు డెంగీ లక్షణాలు కనిపించడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. మెడికల్ అధికారి పూజారి సుజాత ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు వైద్యపరీక్షలు నిర్వహించి, శాంపిల్స్ శ్రీకాకుళం పంపి మందులు అందజేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో అన్ని వీధుల్లో పారిశుద్ధ్యం మెరుగుతోపాటు తాగునీరు క్లోరినేషన్, ట్యాంక్‌లు శుభ్రం చేసేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

● జిల్లాలో 28 డెంగీ కేసులు



పీహెచ్‌సీ అధికారులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

కంచిలి: జిల్లావ్యాప్తంగా విజృంభిస్తున్న సీజనల్ జ్వరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య శాఖాధికారి బి.మీనాక్షి సూచించారు. కంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంచిలికి చెందిన చిన్నారి ఝాన్సీ విష జ్వరంతో మృతి చెందిందని స్పష్టం చేశారు. చిన్నారి ఝాన్సీకి అందిన వైద్యం, వినియోగించిన మందులపై ఆరా తీశారు. ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్న సందర్భంలో ఓవర్‌డోస్ మందులు వినియోగించినట్లు సోంపేట, శ్రీకాకుళం వైద్యులు పేర్కొన్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 28 డెంగీ కేసులు నమోదైనట్లు ఆమె తెలిపారు. కేవలం డెంగీ జ్వరం వస్తే మాత్రమే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయనే అపోహ ప్రజల్లో ఉందని, అలా కాకుండా చాలా సందర్భాల్లో అనారోగ్యం పాలైనప్పుడు ప్లేట్‌లెట్స్ తగ్గుతాయని, దానికి తగిన వైద్యం తీసుకుంటే సరిపోతుందని అన్నారు.

● చెన్నాపురమంతా జ్వరాలే



కీళ్లనొప్పులు, జ్వరంతో బాధ పడుతున్న బడ్డి చిన్నవాడు

నరసన్నపేట: మండలంలోని చెన్నాపురం అంతా జ్వరంతో బాధ పడుతోంది. జ్వరాలు తగ్గిన వారు కీళ్ల నొప్పులతో లేవలేకపోతుండగా మరికొందరు జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. పది రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. జ్వరాలు అదుపులోకి రాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తు తం గ్రామంలోని ప్రతి ఇంటిలోనూ జ్వర పీడితులు కనిపిస్తున్నారు. రోజుకి 20 నుంచి 30 వర కూ జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. సైరి గాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న చెన్నాపురంలో సిబ్బంది వైద్య సేవలు అందిస్తు న్నా జ్వరాలు అదుపులోకి రావడం లేదు. వృద్ధు లు, చిన్నారుల పరిస్థితి దారుణంగా ఉంది. దగ్గు, కఫంతో ఇబ్బంది పడుతున్నారు. సైర గాం పీహెచ్‌సీ వైద్యులు గురునాథ్ మాట్లాడుతూ గ్రామంలో క్యాంపు నిర్వహించామని అందరికీ రక్త పరీక్షలు చేశామని తెలిపారు. ఇప్పుడిప్పుడే జ్వరాలు అదుపులోకి వస్తున్నాయని అన్నారు. అయితే ఒళ్లు నొప్పులు ఉంటున్నాయని మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

● వణుకుతున్న వెలగాడ



స్థానికంగా చికిత్స అందిస్తున్న వైద్యులు

జి.సిగడాం: వెలగాడ నిలువునా వణుకుతోంది. నాలుగు రోజులుగా దాదాపు 35మంది డయేరియా బారిన పడడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా బాతువ వైద్యాధికారులు డాక్టర్ అనూషా, డాక్టర్ ప్రతిష్ఠ శర్మ చికిత్స అందిస్తున్నారు. దీంతో పాటు మూడు టీమ్‌లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. నాలుగేళ్ల చిన్నారి మృతిపై ఆరా తీశారు.

క్లుప్తంగా

నీలమణి దుర్గ హుండీ ఆదాయం రూ.8.67లక్షలు



ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలో కొలువైన ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణి దుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.8,67,616లు వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు తెలిపారు. టెక్కలి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి టీపీ మనస్వీ పర్యవేక్షణలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగిందన్నారు. 70 రోజులగాను ఆదాయం వచ్చిందని చెప్పారు. అలాగే శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో ఉన్న ధర్మహుండీ ఆరు నెలలకు గాను రూ.20,864లు వచ్చిందని ఈఓ చెప్పారు.

హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్: జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల గౌరవ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు సమక్షంలో గురువారం రాత్రి జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ల నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్‌ల సమ్మతితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సనపల విజయలక్ష్మి ఎన్నిక కాగా ఉపాధ్యక్షురాలిగా ఎస్.ఫాతిమాబీబీ, కె.లక్ష్మి, కార్యదర్శిగా డి.మంగమ్మ, కో–కార్యదర్శిగా పి.స్వాతి, కోశాధికారిగా పి.మోహిని, ఉప కోశాధికారిగా ఆర్.ధనలక్ష్మి, జనరల్ సెక్రటరీగా జి.చిన్నతల్లి, వైస్ జనరల్ సెక్రటరీగా ఎంఎం సుశీలారాణి, అసోసియేట్ ఉపాధ్యక్షురాలిగా ఆర్.నిర్మల తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మందస పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ


మందస పోలీస్‌స్టేషన్ పరిస్థితులు ఆరా తీస్తున్న ఎస్పీ మహేశ్వర రెడ్డి

కాశీబుగ్గ: మందస పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డుల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించి నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. మహిళా సంబంధమైన కేసులపై దృష్టి సారించి దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి, నాటు సారా, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ అభ్యర్థులతో మాట్లాడారు.

మెడికవర్‌లో అధునాతన పీడియాట్రిక్ కార్డియాక్ చికిత్స


ఐదేళ్ల చిన్నారికి గుండెజబ్బును నయం చేసిన మెడికవర్ ఆస్పత్రి వైద్యులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రిలో చిన్నారుల కోసం అధునాతన పీడియాట్రిక్ కార్డియాక్ చికిత్స అందుబాటులోకి వచ్చిందని ఆ ఆస్పత్రి కార్డియాలజీ వైద్యులు బుడుమూరు అన్నాజీరావు, అల్లూరి అశోక్ రాజులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళానికి చెందిన ఐదేళ్ల బాబుకు దగ్గు, జలుబుతో పునరావృత శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌లు ఉన్నాయని తెలిపారు. బాబుకు డక్టస్ ఆర్టెరియోసస్ అని పిలిచే గుండెలో పెద్ద రంధ్రం ఉన్నట్లు నిర్ధారించామన్నారు. ఓపెన్ హార్ట్ సర్జరీ చేస్తే అధిక వ్యయం, రిస్క్ ఉంటుందని చిన్నారి తల్లిదండ్రులు గ్రహించి మెడికవర్ ఆస్పత్రిని సంప్రదించగా ఎలాంటి ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా కీహోల్ ఇంటర్‌వెన్షనల్ విధానం ద్వారా రంధ్రాన్ని మూయడం జరిగిందని తెలిపారు. ఆపరేషన్ జరిగిన రెండు రోజులకే బాబు డిశ్చార్జ్ అయ్యి ఇపుడు పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. పుట్టుకతో వచ్చే గుండె జబ్బులతో బాధపడుతున్న పిల్లలకు తగిన రోగ నిర్ధరణ, చికిత్స సేవల కోసం మెడికవర్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ కార్డియాక్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి

కాశీబుగ్గ: నెమలినారాయణపురం గ్రామం వద్ద శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పురుషోత్తపురం గ్రామానికి చెందిన కడమటి ఆదినారాయణ (52) మృతి చెందారు. ఉద్దాన ప్రాంతంలో ఉన్న తన గొర్రెల మందను చేరుకోవడానికి బయల్దేరిన ఆదినారాయణ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా నెమలినారాయణపురం గ్రామం వద్ద ఒడిశా రాష్ట్రానికి చెందిన ఐషర్ వ్యాను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కాశీబుగ్గ సీఐ దాడి మోహనరావు, ఎస్ఐ రేవతి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును సీసీ ఫుటేజీలో పరిశీలించారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అయ్యో.. హోమియో

- వైద్యులు లేక మూతపడిన హోమియో వైద్య శాలలు
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న రోగులు
- ఇతర ప్రాంతాలకు వెళ్లలేక అవస్థలు


సారవకోట మండలం చీడిపూడిలో తలుపులు తెరుచుకోని హోమియో వైద్యశాల

సారవకోట: జిల్లాలోని పలు హోమియో వైద్యశాలలు వైద్యులు లేక మూతబడుతున్నాయి. హోమియో మందుల వాడకం ఇదివరకు కంటే ఇప్పుడు జిల్లాలో బాగా పెరిగింది. ఈ మందులతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని, ఇతర సమస్యలు ఉత్పన్నం కావని చాలా మంది నమ్ముతారు. జిల్లాలో ఆయుష్‌లో భాగంగా హోమియో వైద్యశాలలను చీడిపూడి, శ్రీముఖలింగం, పాతపట్నం, తెంబూరు, పొన్నాడ, కింతలి, తొగరాం, బ్రాహ్మణతర్ల, తోటవాడ, శ్రీకాకుళం, జగతి, సంత ఉరిటిలలో ఏర్పాటు చేశారు. కానీ డాక్టర్లు మాత్రం తెంబూరు, పొన్నాడ, కింతలి, తొగరాం, బ్రహ్మణతర్లా, శ్రీకాకుళంలలో మాత్రమే ఉన్నారు. మిగిలిన చోట్ల వైద్యులు లేక పోవడంతో తలుపులు తీసే పరిస్థితి కూడా లేదు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వైద్యులలో కింతలి, బ్రహ్మణతర్లా వైద్యులు ఇన్‌చార్జ్‌లుగా మూడు రోజులు చొప్పున సంత ఉరిటి, జగతిలలో పని చేస్తున్నారు. పాతపట్నంలో కాంపౌండర్ మాత్రమే వైద్యశాలలు తెరిచి విధుల నిర్వర్తిస్తుండగా చీడిపూడి, శ్రీముఖలింగం, తోటవాడ హోమియో వైద్యశాలల్లో వైద్యులు గానీ ఇతర సిబ్బంది గానీ లేకపోవడంతో తలుపులు తెరుచుకోవడం లేదు. దీంతో ఆ భవనాలు సైతం పాడైపోతున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న వారంతా శ్రీకాకుళం, ఇతర ప్రాంతాలలో ఉన్న పలువురు హోమియో వైద్యుల పై ఆధారపడుతున్నారు. ఇటీవల శ్రీముఖలింగం, చీడిపూడి చుట్టు పక్కల ప్రాంతాల వారు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో హోమియో వైద్యులు లేక తలుపులు తెరుచుకోవడం లేదని ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీని పై స్పందించిన తగిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

ఏడాది నుంచి..



ఇక్కడ పనిచేసిన హోమియో వైద్యులు బదిలీ పై ఇతర ప్రాంతాలకు ఏడాది కిందట వెళ్లారు. అప్పటి నుంచి నేటి వరకు హోమియో వైద్యుల నియామకం జరగక పోవడంతో తలుపులు తెరుచుకోవడం లేదు. మా చుట్టు పక్కల ప్రాంతాల్లో చాలా మంది హోమియో వైద్యం నమ్ముతున్నారు. ఆ సేవలు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– నిక్కు కృష్ణారావు, మాజీ ఎంపీటీసీ, చీడిపూడి, సారవకోట మండలం

ఏపీపీఎస్ ద్వారా నియామకం జరుగుతుంది

జిల్లాలో పలు చోట్ల హోమియో వైద్యులు లేకపోవడం వాస్తవం. దీనిపై గతంలో ఏపీపీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల నియామకాలు జరగలేదు. దీనిపై ప్రభుత్వం నివేదిక పంపించాం. త్వరలో నియామకం జరుగుతుంది.

– వై.శేఖర్, ఆయుష్ విభాగం రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, విశాఖపట్నం

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు


హరితాంధ్ర కోసం అడుగేద్దాం పేరిట వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా అటవీశాఖ ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే నినాదంతో వనమహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లాల విభజన వలన జిల్లాలో 21 శాతం మాత్రమే పచ్చదనం ఉందని మొక్కలునాటి 50 శాతానికి పెంచుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో మొక్కలు నాటాలని చెప్పారు. ఎవరైనా తనను కలవడానికి వస్తే బొకేలు, పూలదండలు తీసుకురావద్దని మొక్కలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఎరువుల కొరత లేకుండా చేస్తానన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో 30 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమం నవంబరు వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఏడిపిస్తున్నారు

- వైఎస్సార్ సీపీ మద్దతుదారుల పింఛన్లు తొలగించేందుకు కుట్ర


దివ్యాంగుడు దల్లి రామకృష్ణ

ఇచ్ఛాపురం రూరల్: 'ఎమ్మెల్యే చెప్పారు.. మేం నోటీసులు అందజేశాం. పింఛన్‌కు అర్హులమంటూ నిరూపించుకోవాల్సిన బాధ్యత నోటీసులు అందుకున్నవారిదే' అంటూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది స్పష్టం చేస్తున్నారు. మశాఖపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులైన ఆరుగురు పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు అందజేశారు. వివరణ ఇవ్వకుంటే శాశ్వతంగా పింఛన్‌ను రద్దు చేయాలంటూ ఇచ్ఛాపురం ఎంపీడీఓ కార్యాలయానికి స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో నగిరెడ్ల తుంభనాథం (వృద్ధాప్య), బాకి కురమ్మ(వితంతు), దల్లి రామకృష్ణ(వికలాంగుడు), ఆశి దాలమ్మ(ఒంటరి మహిళా), కన్నిండి మోహినమ్మ(వితంతు), అర్తికట్ల లోలమ్మ(ఒంటరి మహిళ)లకు నోటీసులు అందజేశారు.

మశాఖపురం గ్రామానికి చెందిన దల్లి రామకృష్ణ ఏడాది క్రితం అనారోగ్యం బారిన పడి నరాల చచ్చుబడటంతో దివ్యాంగుడయ్యారు. స్థానికంగా ఆధార్, ఓటరు, రేషన్ కార్డు కలిగిన రామకృష్ణకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదు నెలలు నుంచి వికలాంగుల పింఛన్ అందజేస్తోంది. ఇతను ఒడిశాకు చెందిన వ్యక్తి అంటూ స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అశోక్‌కు ఫిర్యాదు చేశారు. నగిరెడ్ల తుంభనాథం భార్య ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నందున పింఛన్ తొలగించాలని, బాకి కురమ్మకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే వితంతు పింఛన్ మంజూరు చేయగా, వైఎస్సార్ సీపీకి ఓటు వేసిందన్న నెపంతో ఒడిశాకు చెందిన మహిళ అంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఒంటరి మహిళా పింఛన్ అందుకుంటున్న ఆశి దాలమ్మ భర్త ఏడేళ్ల క్రితం కర్ణాటకలో వేరే మహిళను పెళ్లి చేసుకొని అక్కడే స్థిరపడిపోగా, ఆమె భర్తతో కాపురం చేస్తుందని, పింఛన్ తొలగించాలని ఫిర్యాదు చేశారు. కన్నిండి మోహినమ్మ భర్త పదేళ్ల కిందట మృతి చెందగా, ఈమెకు వితంతు పింఛన్ అందుతోంది.

అయితే వైఎస్సార్ సీపీకి ఓటు వేసిందన్న నెపంతో ఆమె ఒడిశాకు చెందిన మహిళా అంటూ, పింఛన్ నిలిపివేయాలంటూ ఫిర్యాదు చేశారు. ఒంటరి మహిళ పింఛన్ పొందుతున్న అర్తికట్ల లోలమ్మ తన కుమార్తె చామంతికి పెళ్లి చేసి అత్తారింటికి పంపించేసింది. చామంతి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తుంది. కుమార్తె అంగన్‌వాడీ కార్యకర్త కనుక ఆమె పింఛన్ నిలిపివేయాలంటూ స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అశోక్ వారి పింఛన్లు ఆపేయాలంటూ ఆదేశించారు. దీంతో బాధితులు శుక్రవారం అన్ని రకాల అర్హత పత్రాలతో ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు.

వైఎస్ జగన్ బొమ్మ ధ్వంసం

- రావివలస సచివాలయంపై ఉన్న బొమ్మను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు


సచివాలయంపై ఉన్న వైఎస్ జగన్ చిత్రం


ఆ ఫలకాన్ని తొలగించిన దృశ్యం

టెక్కలి : టీడీపీ ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. టెక్కలి మండలం రావివలస గ్రామ సచివాలయంలో ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ బొమ్మను కొంత మంది టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సచివాలయాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ కదంబాల భాస్కరరావు, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ తెలిపిన వివరాలు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.40 లక్షలతో సచివాలయ నిర్మాణం మొదలుపెట్టి చివరి దశకు చేర్చారు. సుమారు రూ.10 లక్షల మేరకు పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఈలోగా ప్రభుత్వం మారింది. ఇటీవల 28వ తేదీన మండల జేఈ ఎస్ఎల్ నాయుడు కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి మరో రెండు రోజుల్లో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా సచివాలయ ప్రారంభోత్సవం చేస్తున్నామని, పనులు పూర్తి చేయాలని సూచించారు. అయితే రెండు రోజుల్లో పనులు పూర్తి చేయలేనని చెప్పడంతో, గ్రామానికి చెందిన కొంత మంది టీడీపీ కార్యకర్తలకు ఆ పనులు అప్పగించారు. అయితే టీడీపీకి చెందిన కొంత మంది కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ సచివాలయంలో ఉన్న వైఎస్ జగన్ బొమ్మను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పీఆర్ ఇన్‌చార్జి ఈఈ సూర్యప్రకాశ్, జేఈ ఎస్ఎల్ నాయుడు తదితరులు సచివాలయాన్ని పరిశీలించారు. మండల జేఈ ఎస్ఎల్ నాయుడే.. జగన్ బొమ్మను తొలగించాలని తమకు చెప్పినట్టు టీడీపీ కార్యకర్తలు చెబుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు.

ఉత్సాహంగా జిల్లా సెపక్‌తక్ర జట్ల ఎంపికలు


ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, ఎస్వీడీ మురళి, మానస శ్రీను, అర్జున్

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం వేదికగా శుక్రవారం జిల్లా సెపక్‌తక్ర జట్ల ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా సెపక్‌తక్ర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల సెపక్‌తక్ర చాంపియన్‌షిప్–2024 పోటీలు జరగనున్నాయి.

ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా తుది జట్లను వచ్చే నెల శ్రీకాకుళం వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి పోటీలకు సన్నద్ధం చేస్తామని ఎమ్మెస్సార్ పేర్కొన్నారు.

ఎంపికలను సెపక్‌తక్ర అసోసియేషన్ కార్యదర్శి, డీఎస్ఏ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి నిర్వహించారు. ఎస్వీడీ మురళి, మానస హోటల్ పైడి శ్రీనివాస్, నక్క శంకర్, విష్ణు, పి.కొర్లయ్య, బాబ్జి, వేణుగోపాల్, మున్నా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

3న శ్రీకాకుళం మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో సెప్టెంబర్ 3వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు తెలిపారు. కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ జాబ్‌మేళాలో డాక్టర్ రెడ్డీస్, ఏటీసీ టైర్స్, అపోలో ఫార్మా కంపెనీలతోపాటు ఐ స్మార్ట్ సొల్యూషన్స్, ట్రెండ్స్, మంగళం స్టోర్స్, అన్‌లిమిటెడ్, మహేంద్రా ఫైనాన్స్, కళానికేతన్ వంటి సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీయువకులు అర్హులన్నారు. టెన్త్‌క్లాస్ నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, ఫార్మసీ, పీజీ, ఎంబీఏ, తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు అర్హులని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన జీతం, ఇతర అలవెన్సులు ఉంటాయన్నారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు కళాశాల సెమినార్ హాల్ వద్దకు తమ బయోడేటాతోపాటు విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్‌కాపీలు, మూడు పాస్ ఫొటోలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూర్యచంద్ర కోరారు.

'ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదు'

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలకు కేటాయించిన స్థలంలో తాము ఆక్రమణలకు పాల్పడలేదని ఎస్.మహేశ్వరరావు, కొండలరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1983లో గురుకుల భూ సేకరణలో తమ తండ్రి అప్పలరాజు సర్వే నంబర్ 234లో అమ్మగా, 234/1లో మిగులు భూమి తమ కుటుంబ సభ్యులకు వారసత్వంగా వచ్చిందని, అందుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తమ వద్ద ఉన్నాయని అన్నారు. 40 ఏళ్ల నుంచి భూమి తమ ఆధీనంలో ఉందని చెప్పారు. గురుకుల భూమి, ప్రభుత్వ భూమి అంగుళం సైతం ఆక్రమించలేదని పేర్కొన్నారు.

రవాణా బకాయిలు చెల్లించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న వాహనాల రవాణా ఖర్చుల బకాయిలు చెల్లించాలని రవాణా చేస్తున్న వాహన యజమానులు కృష్ణ, మహేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో వీరు శుక్రవారం తమ సమస్య వివరించారు. కాంట్రాక్టర్ గత ఎనిమిది నెలల నుంచి రూ. 40 లక్షలు చెల్లించ లేదని అన్నారు. అధికారులు స్పందించి తక్షణం న్యాయం చేయాలని కోరారు.

జెడ్పీలో పలువురికి నియామకాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాల కింద శుక్రవారం పలు స్థాయిల్లో ఉద్యోగాల నియామకాలను చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అర్హులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. వివిధ కేడర్‌లలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబాలలో సాంఘిక భద్రతా పథకం కింద ఆఫీస్ సబార్డినేట్‌లుగా వెంకట విజయలక్ష్మిని గార మండలం జెడ్పీ హైస్కూల్‌లోనూ, బమ్మిడి చిదంబరేశ్వరరావుకు జెడ్పీ హైస్కూల్ లావేరులోనూ నియమిస్తూ నియామకపత్రాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


అధికారుల దృష్టికి సమస్య తీసుకు వెళుతున్న కాంట్రాక్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణతో కూడిన బృందానికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మహిళా కాంట్రాక్టు అధ్యాపకులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అర్హత నెట్, సెట్, పీహెచ్‌డీ బట్టి డిజిగ్నేషన్లు మార్పు చేయాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి సమస్య తీసుకు వెళ్లి పరిష్కరించాలని కోరారు.

రెండున్నర తులాల బంగారం చోరీ


చోరీ జరిగిన ఇంటిలో చిందర వందరగా బీరువాలోని వస్తువులు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకుని కుశాలపురం పంచాయతీ నవభారత్ సమీపంలోని సీపాన వెంకటరమణ ఇంటిలో గురువారం అర్ధ రాత్రి చోరీ జరిగింది. ఇంటి తాళాలు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. వెండి వస్తువులు, ఇతర గృహ సామగ్రిని మాత్రం వదిలేశారు. వెంకటరమణ తమ్ముడి కుమార్తెకు ఆరోగ్యం బాగులేకపోవడంతో గురువారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లారు. ఆయన భార్య మాధురి కూడా నాలుగు రోజుల కిందట విశాఖలోని బంధువుల ఇంటికి వెళ్లారు. దీంతో తాళం వేసి ఉన్న ఇంటిలోకి దొంగలు ప్రవేశించి బంగారం దొంగతనం చేశారు. శుక్రవారం ఉదయం ఇంటి యజమానికి వచ్చి చూసే సరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఎస్ఐ ఎస్.చిరంజీవి, ఏఎస్ఐ శ్రీనివాసరావు చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. జాతీయ రహదారికి ఆనుకుని ఇటీవల దొంగతనాలు పెరుగుతున్నాయి. కుంచాలకూర్మయ్యపేటలోని దేవీ పీఠం లో అమ్మవారి నగలు, హుండీ చోరీ, తమ్మినాయుడుపేటలో లలితా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో చోరీ, కొయ్యారాళ్ల సమీపంలో ఓ ఇంటిలో చోరీ వంటివి చోటు చేసుకున్నాయి. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉన్నా చోరీలు జరుగుతుండటం గమనార్హం.

అన్ని రంగాల్లో మార్పులు అనివార్యం


సెమినార్ సావనీర్ విడుదల చేస్తున్న వీసీ రజిని, అతిథులు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక ప్రగతి నేపథ్యంలో అన్ని రంగాల్లో మార్పులు వస్తున్నాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో శుక్రవారం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ హ్యూమన్ రిసోర్సు మేనేజ్ మెంట్ ఇష్యూస్– ఛాలెంజస్, స్ట్రాటజీస్ అంశంపై నిర్వహించిన రెండు రోజుల సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాల్లో సాంకేతిక ప్రగతి విస్తరిస్తోందని తెలిపారు. విద్యా రంగంలో సైతం సమూల మార్పులు వస్తున్నాయని అన్నారు. ఉన్నత విద్యలో సిలబస్, కరిక్యులమ్‌లో మార్పులు అమలు చేయాల్సి ఉందన్నారు. పారిశ్రామిక అవసరాలు, ఉద్యోగాలు, ఉపాధి లక్ష్యంగా ఉన్నత విద్య ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో అండస్ లియోడస్ బ్యాంక్ అధికారి తిర్లంగి హరిబాబు, హైదరాబాద్‌కు చెందిన హెరిటో ఫార్మా హెడ్ ఆనంద రెడ్డి, లిల్కో పరిశ్రమ హెచ్‌ఆర్ వెంకటసత్యశ్రీ కుమార్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.తులసీదాస్, సెమినార్ కన్వీనర్ కూన అచ్యుతరావు పాల్గొన్నారు.

'వివాహిత ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు'


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నరసన్నపేట: స్థానిక శ్రీనివాస అపార్ట్‌మెంటు నాలుగో ఫ్లోర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన బరాటం అనూరాధ భర్త శ్రావణ్‌ను అరెస్టు చేసినట్లు పలాస డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వరకట్న వేధింపులతో అనూరాధ ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. భార్యాభర్తల మధ్య రోజూ ఘర్షణలు జరిగేవని, అనూరాధ మృతి చెందిన రోజు కూడా ఇద్దరూ గొడవ పడ్డారని అన్నారు. శ్రీకాకుళంలో ఒక ఫంక్షన్‌కు వెళ్లేందుకు ఇద్దరూ బయల్దేరి మధ్యలో గొడవపడ్డారు. దీంతో మడపాం టోల్‌గేట్ నుంచి శ్రీకాకుళం వెళ్లకుండా వెనక్కి వచ్చేశారని డీఎస్పీ తెలిపారు. ఇంటికి వచ్చిన వెంటనే శ్రావణ్ తన గాజుల షాపునకు వెళ్లగా అనూరాధ బెడ్‌రూంలోనికి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. గాజుల షాపులో ఉన్న శ్రావణ్ తన భార్యకు ఫోన్ చేయగా ఆమె లిఫ్ట్ చేయకపోవడంతో ఇంటికి వచ్చి చూసే సరికి బెడ్‌రూం తలుపులు లోపల గెడ వేసి ఉందని, గెడ విరగ్గొట్టి తలుపులు తీసి లోపలికి వెళ్లే సరికి అనూరాధ మృతి చెంది ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఈ వివరాలన్నీ శ్రావణ్ నుంచి తెలుసుకున్నామని చెప్పారు. అయితే మృతురాలి తల్లిదండ్రులు శ్రావణ్ తల్లిదండ్రులపైనా ఫిర్యాదు చేశారని, కానీ వారి ప్రమేయం కనిపించడం లేదని తెలిపారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీ పీటీడీ ఉద్యోగులకు నిలిపివేసిన అలవెన్సులను పునరుద్ధరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్‌కే రావు, వై.అప్పయ్యలు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయ ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ పీటీడీ ఉద్యోగులు రాత్రనక, పగలనక పనిచేస్తున్నారని, వారికి అన్ని అలవెన్స్‌లతో పాటు నైట్ అవుట్ అలవెన్స్‌లు, (టీఏ) డ్యూటీ అలవెన్స్‌గానే ఇవ్వాలని డిమాండ చేశారు. చాలా చోట్ల ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సెటిల్‌మెంట్‌లు, సర్వీసులో ఉన్న ఉద్యోగుల అరియర్స్ బిల్లులు, సిక్ లీవులకు జీతాల బిల్లులు, ఏఏఎస్, ఇంక్రిమెంట్ అరియర్స్ తదితర అనేక విషయాల్లో ట్రెజరీశాఖ ఉద్యోగులు ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు వి.ధర్మారావు, కేటీ రావు, ఆర్ఎస్ చలం, ఏజీ రాజులు, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.